క్లుప్తంగా

మోనోపాజ్ సమస్యలపై అవగాహన



గుంటూరు మెడికల్: వరల్డ్ మోనోపాజ్ హైజీన్ డే సందర్భంగా శుక్రవారం నాగార్జున నగర్ జేఎంజే హైస్కూల్ ప్రాంగణంలో గుంటూరు హోప్‌విన్ హాస్పిటల్, సలామ్ నమస్తే గుంటూరు సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో హోప్‌విన్ హాస్పిటల్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ రుతుక్రమం సమయంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. రుతుక్రమం సమయంలో వచ్చే సమస్యలను ఏవిధంగా నివారించాలనే విషయాలపై, ఆహార నియమాలపై మోనోపాజ్ విషయంలో మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పలువురు మహిళలకు శానిటరీ ప్యాడ్స్ అందజేశారు. కార్యక్రమంలో సిస్టర్ రోజ్లినా, వార్డెన్ మల్లేశ్వరి, టీచర్ ప్రశాంతి, హోప్‌విన్ హాస్పటల్ మేనేజర్ పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భవనం పై నుంచి కింద పడి వృద్ధురాలి మృతి

లక్ష్మీపురం: భవనం పై నుంచి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన పై అరండల్‌పేట పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనగర్ 7/7వ లైన్‌కు చెందిన తిరుమలశెట్టి లక్ష్మి, భర్త శ్రీనివాసరావు వద్ద లక్ష్మి తల్లి సాగిరి అచ్చమ్మ(67) ఉంటుంది. అయితే గురువారం రాత్రి తల్లి అచ్చమ్మ భోజనం చేసి నిద్ర పోయింది. తెల్లవారుజామున భవనం పై నుంచి కింద పడింది. దీన్ని గమనించిన స్థానికులు, వృద్ధురాలిని జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి మృతురాలి కుమార్తె తిరుమలశెట్టి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్ అద్దాలు, లైట్లు ధ్వంసం

నగరంపాలెం: బిర్యానీ పార్శిల్ లేదని చెప్పడంతో కొందరు కుర్రాళ్లు బిర్యానీ హోటల్ అద్దాలు, దీపాలు ధ్వంసం చేశారని ఓ నిర్వాహకురాలు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుచ్చయ్య తోటకు చెందిన షేక్ ఫరీదాబేగం, షాజహాన్ రైలుపేటలో తలపకట్టి బిర్యానీ హోటల్ నిర్వహిస్తున్నారు. ఈనెల 27 రాత్రి పుట్టిన రోజు వేడుకలో భాగంగా భోజనం అరగించేందుకు నగరానికి చెందిన వారు బుక్ చేసుకున్నారు. ఈ క్రమంలో రాత్రి 11 తర్వాత సదరు కుర్రాళ్లు ఐదు బిర్యానీ పార్శిల్ చేయాలని నిర్వాహకులకు సూచించారు. అయితే సమయం దాటిన భోజనం పార్శిల్ ఉండదని నిర్వాహకులు కుర్రాళ్ల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కోపోద్రిక్తులైన కుర్రాళ్లు హోటల్ అద్దాలు, లైట్లు ధ్వంసం చేశారు. దీనిపై నిర్వాహకురాలు ఫరీదాబేగం కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సలీం, గౌస్‌తోపాటు మరి కొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్రసాము పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: కోయంబత్తూరులో ఇటీవల జరిగిన అంతర్జాతీయస్థాయి కర్రసాము(సిలంబం) పోటీల్లో మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని పాఠశాల కరస్పాండెంట్ కేవీ సెబాస్టియన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వి.హంసినీ మీనాక్షి బంగారు పతకంతో పాటు, వి.వైదిక్ కాంస్య పతకాన్ని సాధించారని చెప్పారు. ప్రస్తుత సమాజంలో చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో విద్యార్థులు చిన్నతనం నుంచే ఆత్మరక్షణ, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకునేందుకు కర్రసాము ఉపయోగపడుతుందన్నారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్ విద్యార్థులతో పాటు కోచ్ కాశీనాథ్ రెడ్డిని అభినందించారు.

అగ్రిల్యాబ్ ద్వారా రైతులకు మెరుగైన సేవలు

ప్రత్తిపాడు: అగ్రిల్యాబ్ ద్వారా రైతులకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు మండల వ్యవసాయాధికారి, ల్యాబ్ ఇన్‌చార్జి కె.అరుణకుమారి తెలిపారు. ప్రత్తిపాడులోని అగ్రి ల్యాబ్‌కు ఇన్‌చార్జిలే దిక్కయ్యారని.. ఏవోలు చేయాల్సిన పరీక్షలు కూడా ఏఈవోలే చేస్తున్నారని.. ఇన్‌చార్జిగా ఉన్న ఏవోలు కూడా ల్యాబ్‌కు చుట్టం చూపుగా వస్తున్నారంటూ ఈ నెల 28న ‘సాక్షి’లో ‘అగ్రిల్యాబ్‌పై చిన్న చూపు’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఏవో అరుణకుమారి శుక్రవారం ల్యాబ్‌ను పరిశీలించారు. ఇప్పటివరకు చేసిన పరీక్షలు, అందిన శాంపిల్స్, సిబ్బంది హాజరు వంటి విషయాలను పరిశీలించారు. అనంతరం ల్యాబ్‌లోని ఆయా రకాల రిజిష్టర్లను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు.

స్పెషల్ శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



శానిటేషన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్, పక్కన కార్పొరేటర్ గురవయ్య

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వార్డుల వారీగా చేపట్టిన స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ద్వారా వార్డుల్లో పారిశుద్ధ్యంలో సమూల మార్పు రావాలని, నోడల్ అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ కేవీపీ కాలనీ, భాను ప్రసాద్ కాలనీ, శశాంక్ గోయల్ కాలనీల్లో స్పెషల్ శానిటేషన్ పనులు, వెంగళాయపాలెం టిడ్కో గృహ సముదాయాలు, నల్లపాడులోని పలు ప్రాంతాల్లో పర్యటించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మెరుగైన పారిశుద్ధ్యాన్ని ప్రజలకు అందించేందుకు వార్డుల వారీగా రెగ్యులర్‌గా పని చేసే కార్మికులు కాకుండా అదనంగా కార్మికులు, వాహనాలను కేటాయించామని చెప్పారు. స్పెషల్ శానిటేషన్ ద్వారా ఆయా వార్డుల్లో ప్రజలు సంతృప్తి చెందేలా పనులు జరిగేలా నోడల్ అధికారులు, ప్రజారోగ్య అధికారులు పర్యవేక్షణ చేయాలని కోరారు. ప్రధానంగా కాలువల్లో పూడికతీత, డంపింగ్ పాయింట్స్, ఖాళీ స్థలాలపై దృష్టి పెట్టాలని చెప్పారు. అనంతరం నల్లపాడు హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులు పరిశీలించారు. నల్లపాడు మెయిన్ రోడ్‌లో రైల్వే స్టేషన్‌కి వెళ్లే రోడ్‌లో డ్రెయిన్ నిర్మాణ పనులు నిలిచిపోవడం గమనించి, అధికారులను అడిగి తెలుసుకొని, వెంటనే పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. వెంగళాయపాలెంలోని టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించి, నివాసితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని, తక్షణం వీధి దీపాలు ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేయాలని డీఈఈని, డ్రెయిన్లను శుభ్రం చేయాలని, ఖాళీ స్థలాల్లో జంగిల్ క్లియర్ చేయించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పర్యటనలో టిడ్కో ఎస్ఈ ఉమాశంకరశాస్త్రి, ఈఈ కోటేశ్వరరావు, కార్పొరేటర్ కె.గురవయ్య, జీఎంసీ డిఈఈ శ్రీనివాస్, టిడ్కో డీఈఈ సేతుబాబు, ఎస్ఎస్ రాజేష్ పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు సహకారం

నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల జనన నియంత్రణకు(ఏబీసీ) సంబంధించి నగరపాలక సంస్థకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం తోడ్పాటు అందించడం అభినందనీయమని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం నగర కమిషనర్ చాంబర్ లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పయినీర్ గ్రూప్, చుక్కపల్లి శంకరరావు చారిటబుల్ ట్రస్ట్ తరపున నెలకు రూ.3 లక్షలు చొప్పున 10 నెలలు పాటు అందించేందుకు చుక్కపల్లి రాకేష్ ఏబీసీకి తోడ్పాటు అందిస్తామని అంగీకార పత్రాన్ని మేయర్, కమిషనర్‌కు అందించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పయనీర్ గ్రూప్, చుక్కపల్లి శంకరరావు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అనూష మృతికి కారకులపై చర్య తీసుకోవాలి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు వినతి



రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: రజక మహిళ తొరటి అనూష అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రజక వృత్తి దోబీ ఘాట్ల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు చెన్నూరి చెన్నయ్య విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం అనూష కుటుంబ సభ్యులతో కలిసి మంగళగిరిలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరానికి చెందిన తొరటి అనూషకు గోరంట్లకు చెందిన పార్థసారథితో 2018లో వివాహమైందని..పార్థసారథి వృత్తి రీత్యా చైన్నైలో ఉంటున్న నేపథ్యంలో ఇరువురు చైన్నైలో ఉంటున్నారని చెప్పారు. 2024లో అనూష గర్భం దాల్చిందని.. అక్కడి వైద్యులు పరిక్షించి ఆరోగ్యం బాగోలేదు.. ప్రయాణం చేయకూడదని విశ్రాంతి తీసుకోవాలని సూచించినప్పటికీ ఆమె భర్త దురుద్దేశంతోనే కావాలని చెన్నై నుంచి గుంటూరుకు తీసుకువచ్చి నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారని అక్కడి వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించి తల్లి, బిడ్డ మరణానికి కారకులైయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టి అనూష భర్త, ప్రైవేట్ ఆసుపత్రి డాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు రెడ్డి హాస్టల్ పూర్వ విద్యార్థుల సమావేశం

నెహ్రూనగర్: గుంటూరు నగరంపాలెంలోని ఎస్‌వీఎస్‌ఆర్ రెడ్డి బాయ్స్ హాస్టల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఏర్పాటు చేసినట్లు రెడ్డి హాస్టల్ మేనేజర్ జంగా సత్యనారాయణరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 1977 నుంచి 2024 వరకు హాస్టల్‌లో చదువుకున్న వారంతా ఈ సమ్మేళానికి హాజరవుతున్నట్లు చెప్పారు.

పీఠభూములపై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రాంతీయ గ్రంథాలయంలో శుక్రవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థిని వి.వెంకటకృష్ణ భారతదేశంలో పీఠభూములపై తరగతులు నిర్వహించారు. పీఠభూములు, నదులు వాటి ప్రాముఖ్యత, జన్మస్థానం తదితర అంశాలను వివరించారు. కరోనా నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలియజేశారు. గ్రంథాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం చిన్నచూపు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీ జేఏసీ చైర్మన్ గాలి వినోద్‌కుమార్

నెహ్రూనగర్: దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పక్షపాతంగా వ్యవహరిస్తూ చిన్న చూపు చూస్తోందని దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ(డీజేఏసీ) జాతీయ చైర్మన్ డాక్టర్ గాలి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాలకు రావాల్సిన వాటాలను, నిధులను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పార్లమెంట్ స్థానాల పునర్విభజన పేరుతో వంద సీట్లకే దక్షిణాది రాష్ట్రాలను పరిమితం చేసేందుకు కేంద్రం కుయుక్తులు పన్నుతుందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, తెలంగాణకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడంతో పాటు హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీజేఏసీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా కైలా జయసుధను నియమించారు. ముందుగా డీజేఏసీకి సంబంధించిన డిమాండ్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రమణయ్య, సాంబశివరావు, వాసు, శ్రీనివాసరావు, ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

టీసీఎస్‌లో ఉద్యోగాలకు 27 మంది ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలలో శుక్రవారం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 27 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ అధికారి డాక్టర్ యలవర్తి సురేష్‌బాబు తెలిపారు. టీసీఎస్ సంస్థ వివిధ దశల్లో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.గోపీచంద్, కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.సాంబశివరావు విద్యార్థులను అభినందించారు.

సీపీఎం నేత పుతుంబాక చిరస్మరణీయుడు



పుతుంబాక వెంకటపతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

లక్ష్మీపురం: దేశ సమైక్యత, సమగ్రత పరిరక్షణ కోసం అమరజీవి పుతుంబాక వెంకటపతి స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సీపీఎం నేత పుతుంబాక వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వై.నేతాజీ మాట్లాడుతూ వెంకటపతి రైతాంగ సమస్యలపై ప్రత్యేకమైన అధ్యయనం, పరిశీలన చేసేవారని గుర్తు చేశారు. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర నాయకునిగా ఎదిగారని తెలిపారు. శాసన సభ్యునిగా, ఫిరంగిపురం సమితి అధ్యక్షుడిగా నియోజకవర్గంలో రహదారులు, పాఠశాలల భవనాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చి పనిచేశారన్నారు. నేటి యువతరం ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాశం రామారావు మాట్లాడుతూ ప్రధానంగా నాగార్జున సాగర్ ఆయకట్టు ప్రాంత సమస్యలు, రైతాంగానికి గిట్టుబాటు ధరల సమస్యలపై నిరంతరం కృషి చేశారన్నారు. భూమి కోసం, భుక్తికోసం, పేదల విముక్తి కోసం జరిగిన ఉద్యమానికి అనేక విధాలుగా సహకరించారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, జిల్లా నాయకులు బి.లక్ష్మణరావు, ఎం.ఎ.చిష్టీ, బి.ముత్యాలరావు, వై.కృష్ణకాంత్, బెర్లగాని శ్రీనివాసరావు, కె.శ్రీనివాస్, కె.పద్మ, ఎస్.పద్మ, జి.వెంకట్రావు పాల్గొన్నారు.

భార్యాభర్తలపై దాడి

నగరంపాలెం: బాకీ అడిగిన భార్యాభర్తలపై దాడికి పాల్పడ్డారు. వివరాలు.. రామిరెడ్డితోట ఐదో వీధిలో పర్వేందర్‌సింగ్ మెకానిక్ దుకాణం నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల అదే ప్రాంతానికి చెందిన సంధ్య, స్కూటీని మరమ్మతుల దృష్ట్యా మెకానిక్ దుకాణానికి తీసుకొచ్చింది. రూ.1,500 ఇవ్వాలని కోరగా ఆమె రూ.500 చెల్లించింది. మిగతా రూ.1,000 చెల్లించాలని పలుమార్లు అడిగిన ఆమె చెల్లించలేదు. రెండు రోజుల క్రితం పర్వేందర్‌సింగ్, భార్యతో కలసి ఆమె ఇంటి వద్దకెళ్లి డబ్బులు అడిగారు. సంధ్యతో పాటు మరికొందరు ఏకమై వారిపై దాడికి పాల్పడ్డారు. మెకానిక్ శుక్రవారం కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

హక్కులు కాపాడుకునేందుకు పోరాటం



సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

లక్ష్మీపురం: ఐక్యత– పోరాటం నినాదంతో సీఐటీయూ ఆవిర్భవించిందని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు పేర్కొన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గుంటూరు శ్రీనివాసరావుపేటలోని మున్సిపల్ కార్మికుల మస్టర్ పాయింట్‌లో జెండాను ఆవిష్కరించారు. ముత్యాలరావు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మికులు పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్స్ ను తీసుకు వచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే కార్మికులు పెట్టుబడిదారుల బానిసలుగా మారిపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని జూలై 9న దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ సమ్మెలో మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ 4 లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, కార్మికుల సామాజిక భద్రత హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గుంటూరు మల్లికార్జునరావు, చల్లాపల్లి కిన్నెర్, బాలకృష్ణ, మణి, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

పొన్నూరు: మండలం, పట్టణ పరిధిలో కార్డుదారులకు జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపులలోనే రేషన్, సరుకులను పంపిణీ చేయాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ డీలర్లకు సూచించారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి 12 వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుత్ శాఖ అధికారుల తీరుపై మండిపాటు

ప్రత్తిపాడు: మా మండలంలో విద్యుత్ శాఖ అట్టర్ ఫ్లాప్ అని.. ఏ మాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తోందని వైస్ ఎంపీపీ కె.సాంబశివరావు ధ్వజమెత్తారు. మండల కేంద్రం పెదనందిపాడులో శుక్రవారం ఎంపీపీ హెప్సిబా అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గత కొద్ది రోజులుగా పెదనందిపాడు మండలంలో కోతలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సమావేశంలో వైస్ ఎంపీపీ విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు. ఆ శాఖ సిబ్బందికి ఫోన్లు చేస్తే కాలయాపన సమాధానాలు వస్తున్నాయని సాంబశివరావు మండిపడ్డారు. స్పందించిన ఇన్‌చార్జి ఏఈ మాట్లాడుతూ.. మండలం మొత్తం మీద 5 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు ఉన్నాయని.. అవన్నీ పరిశీలించి స్పందించడంలో ఆలస్యం అవుతోందని అన్నారు. ఇకపై సమస్యలు పునరావృతం కాకుండా చూస్తామని అన్నారు.

2న ఇళ్ల స్థలాల సాధన కోసం ధర్నా

పొన్నూరు: పేదలు ఇళ్ల స్థలాలను సాధించుకునేందుకు జూన్ 2వ తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం ధర్నాకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమానికి జిల్లా ప్రజా నాట్యమండలి కార్యదర్శి ఆరేటి రామారావు అధ్యక్షత వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాల్లో పేదలకు 2, గ్రామాల్లో 3 సెంట్ల భూమి ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. మంత్రి వర్గ సమావేశంలో తీర్మానం చేసి, విడుదల చేసిన జీవో ప్రకారం అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ఈ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి షేక్. గౌస్, కె.రామారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

4న మెగా యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మేయర్ కోవెలమూడి రవీంద్ర



అధికారులకు తగు సూచనలు చేస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీన నిర్వహించనున్న మెగా యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగా మంత్ కార్యక్రమంలో జూన్ 4వ తేదీ గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియం ఎదురు రోడ్ (యోగా రోడ్)లో నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రజల్లో యోగా పట్ల మరింతగా అవగాహన కలిగించడం కోసం జూన్ 4న ఎన్టీఆర్ స్టేడియం ఎదురు మెగా యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ మెగా యోగాలో నగర ప్రజలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, స్టేక్ హోల్డర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొంటారని అందుకు తగిన విధంగా సదరు ప్రాంతంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, తాగునీరు, ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసులు, నగర పాలక సంస్థ అధికారులు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ రమేష్ బాబు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో విస్తృత అవకాశాలు

మేయర్ కోవెలమూడి రవీంద్ర



మాట్లాడుతున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలతో శారీరక, మానసిక ధృడత్వం అలవడుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలపై ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో యడ్ల రాజ్యాలక్ష్మి మెమోరియల్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పురుషుల బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలకు దూరంగా ఉంటున్నారని, అటువంటి వారికి క్రీడలపై ఆసక్తి కలిగేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. క్రీడలు మానసిక స్థైర్యంతో పాటు భవిష్యత్‌లో విద్యార్థులు ఉన్నతంగా, ధైర్యంగా నిలబడే విధంగా దోహదం చేస్తాయన్నారు. హిందూ కళాశాలలో వ్యాయామ అధ్యాకురాలిగా పని చేసిన యడ్ల రాజ్యాలక్ష్మి స్మారకార్థం ఆమె విద్యార్థులు, కుటుంబ సభ్యులు కలిసి టోర్నమెంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జూన్ ఒకటో తేదీ వరకు జరగనున్న పోటీల్లో క్రీడాకారులు నైపుణ్యాన్ని కనబర్చి, విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, నగరపాలక సంస్థ ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, రాహుల్ చౌదరి, రత్న దివ్యాస్, గింజుపల్లి వరప్రసాదరావు, హెచ్ ఫౌండేషన్ సభ్యులు వెంకటేష్, నారాయణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

బెదిరింపులకు దిగితే ఆందోళన ఉధృతం చేస్తాం



పట్టాభిపురం పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడుతున్న గిగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

లక్ష్మీపురం: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న జొమాటో గిగ్ వర్కర్స్‌పై బెదిరింపులకు పాల్పడి, అక్రమ కేసులు పెడతామంటే ఆందోళన ఉధృతం చేస్తామని గిగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకులు సోగా బ్రహ్మయ్య, యూనియన్ గౌరవాధ్యక్షులు బి.ముత్యాలరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు హెచ్చరించారు. జొమాటో గిగ్ వర్కర్స్ రెండు రోజులుగా తగ్గించినటువంటి పే అవుట్లు పెంచాలని, ఇన్సెంటివులు గతంలో మాదిరిగా ఇవ్వాలని కోరుతూ నిరసన తెలిపారు. అనంతరం వికలాంగుడు అని కూడా చూడకుండా దాడికి పాల్పడిన యాజమాన్యం పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం డెప్యూటీ లేబర్ కమిషనర్‌కు తమ సమస్యలు తెలియజేస్తూ వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమం జొమాటో గిగ్ వర్కర్స్ నాయకులు రణధీర్, శశికుమార్, వెంకట్, నరసింహారావు, వాల్మీకి పాల్గొన్నారు.

వర్షానికి గోడ కూలి పలువురికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం



నవభారత్‌నగర్‌లో ప్రహరీ కూలిన దృశ్యం

లక్ష్మీపురం: గుంటూరులో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రహరీ కూలి ముగ్గురికి గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన రాత్రి 10.30 గంటల సమయంలో చోటుచేసుకుంది. నవభారత్‌నగర్ ప్రధాన రహదారి వద్ద మ్యాక్స్ షోరూం ఎదురు రోడ్డులోని సైడ్ డ్రెయిన్‌పై మామా చికెన్, గుంట పునుగులు విక్రయించుకునేందుకు ప్రహరీకి చిన్నపాటి అడ్డు పెట్టుకుని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సైడ్ డ్రెయిన్ కాలువ పొంగడంతో పాత ప్రహరీ ఒక్కసారిగా కూలింది. ప్రహరీ వద్ద ఉన్న వారిలో ముగ్గురికి తీవ్రమైన గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంలో గాయాలపాలైన వారి వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం ఎస్సై నరహరి ఘటనా ప్రదేశంలో ఘటన జరిగిన వైనాన్ని పరిశీలించారు.

డ్వామా అధికారుల విచారణ



విచారణ నిర్వహిస్తున్న డ్వామా విజిలెన్స్ ఆఫీసర్ హనుమంతరావు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని పాతమల్లాయపాలెంలో డ్వామా విజిలెన్స్ ఆఫీసర్ సి.హనుమంతరావు విచారణ నిర్వహించారు. గ్రామంలో గత కొన్నేళ్లుగా ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న నల్లపు ఏసుబాబు మస్టర్లలో అవకతవకలకు పాల్పడుతున్నారంటూ గతేడాది గ్రామానికి చెందిన కొందరు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం డ్వామా ఏపీడీ, విజిలెన్స్ ఆఫీసర్ హనుమంతరావు స్థానిక సచివాలయంలో విచారణ చేపట్టారు. కొందరు గ్రామస్తులతో మాట్లాడారు. వారి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ.. అప్పటి ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో విచారణ నిర్వహించామన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను తత్కాలికంగా సస్పెండ్ చేశారని.. విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నామని అన్నారు. ఏపీవో ఎస్.ఏడుకొండలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

బ్యాంక్ ఉద్యోగి ఇంట్లో నగలు, నగదు చోరీ

నగరంపాలెం: ఇంటి తలుపులు పగులకొట్టి బీరువాలో దాచిన నగలు, నగదు దొంగలించారు. బాధితుడు ఫిర్యాదుతో పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్టీసీ కాలనీ రెండో వీధిలో ఉంటున్న మోహన్‌రావు ఓ బ్యాంక్‌లో ఉద్యోగి. శుక్రవారం భార్యాభర్త వేర్వేరుగా వారి విధులకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తలుపులు పగులకొట్టి ఉండడాన్ని గుర్తించారు. ఈలోగా లోనికెళ్లి చూడగా, బీరువాలో దాచిన 140 గ్రాముల బంగారం వస్తువులు, లక్ష రూపాయలు దొంగలించారు. దీంతో బాధితుడు పాతగుంటూరు పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.